# ఆశా దీపాలు

ప్రాయోజకులు

STD No. 08457
©: Shop: 22825
Resi: 24163,23285



న్యూ కనకలక్ష్మి టెక్స్ టైల్స్



NEW KANAKA LAXMI
TEX TILES

Raghava Complex Shop No. 4
Subhash Road, SIDDIPET - 502 103
Dist: Medak (A.P.)

**వర్షాకాలం వరదలొచ్చిన గోదావరిలా కమల జీప్‌వెంట పరుగెత్తుతోంది. వేడి నిట్టూర్పులకు స్పందించిన కళ్ళు మంచు పూలైనాయి. ఒంటినిండా అలుముకున్న చెమట చంకను జారుడు బండగా మార్చేస్తోంది.**

జారుతున్న నాలుగేళ్ళ శ్రీనివాసును పైకెగదోస్తూ అంగలేస్తోంది. ఆశా నిరాశల మధ్య కొట్టు మిట్టాడుతోన్న మనసు వేగం పెంచమని పోరుతోంది.

అదే మనసు ఐదేళ్ళ క్రితం ఏమన్నది?

కన్నవాళ్ళ గుండెల మీది కుంపటిలా తయారవక అమ్మా నాన్నలు మెచ్చిన ఆదినారాయణ చేత మూడుముళ్ళేయించుకొమ్మంది. అతని చేతిలో చెయ్యేసి అడుగులో అడుగు కలుపుమంది.

ఆ ఊళ్ళో అందరికంటే అమాయకుడు ఆదినారాయణే. తల్లిదండ్రులు లేకపోయినా తలకుమించిన వినయ విధేయతలూ, సూర్యచంద్రులు రోజూ దర్శనమిచ్చే పెంకుటిల్లు అతని ఆస్తిపాస్తులు.

పరిస్థితుల్ని ఇంతవరకు లాక్కొచ్చింది ఆ వినయ విధేయతలే.

సముద్ర తరంగాల్లా ఎగిసిపడ్తున్న కమల గుండెలు కండరాల శక్తినంతా కాళ్ళ కందిస్తున్నాయి. గతుకుల రోడ్డుమీద గంతులేస్తూ కళ్ళల్లో దుమ్ముగొడ్తున్న జీప్‌నందుకోవాలనే ఆరాటం బలం పుంజుకుంటుంది.

ఆరోజు ... పేగు చించుకు పుట్టిన శ్రీనివాసు మూడేళ్లవాడయ్యాడు... దాచుకున్న అందాలన్నీ దోచుకొమ్మని భర్త ముందుంచింది.

"పాలేరు తనం బంద్‌చేస్తే మనం బతకలేమా ?" అడిగింది.

కమల చెంపల్ని చేతులతో అందుకుంటూ "పాలేరు తనమంటే గచ్చకాయలాటను కున్నవా కమలా ? పాలేరు తనం బంద్‌జేస్తనంటే పద్మారావు దొర ఏమంటడో గదా !"

"గట్టిట్ల ? మీ నాయిన వాళ్ళ నాయిన దగ్గరా నువ్వాయన దగ్గరా, మన కొడుకు ఆయన కొడుకు దగ్గరా ... గిట్ల మన వంశమంతా వాళ్ళ దగ్గర్నే ఎట్టిచాకిరి జెయ్యాల్నా ? నెలకింతని జీతంలేదు. నాల్గు ఘడియల పుర్సతులేదు. ఇట్ల ఎన్నొండ్లుంటాం ?"

ఆది నారాయణకు మొదట గుండెనారాలను లాగి వదిలినట్టనిపించింది. ఆ తర్వాత భార్య అమాయకత్వానికి నవ్వొచ్చింది.

"పాలేరుతనం బంద్‌జేస్తే పాకురుబండలు గీకి బతుకుతమా ?"

కమల పొత్తి కడుపులో కలుక్కుమంది.

"దునియాల అందరూ గిట్లనే బతుకుతుండ్రా ?" విడిపోయి పక్కకు జరిగింది. ఏడుపు లంకించుకున్న కొడుకునెత్తుకుంది.

"కాదుగాని ... దొర ఊకుంటడా?"

"ఊకుండకుంటే ఉరివెట్టు కుంటడా ?" కమల చెక్కిళ్ళు ఎర్రబారినై.

"అదిగాదు కమలా ... " కొడుకు చంకలో కేరింతలు కొడుతూంటే పెళ్ళాం రంభలా కనబడింది " అబ్బ ! బుడ్డోడు పుట్టినంక నీ మొకం ముద్దబంతి పూవైంది. మల్లెపూవోలున్న దానివి మొగిలి పూవోలైనవు."

ఆ మాటకు గుండె కరిగింది. మనసు మయూరమైందప్పుడు. అరికాళ్ళ నరగదీస్తుందిప్పుడు.

"ఆగే పోరీ... ఎంత దూరమురికొస్తవ్ !" జీప్‌లోంచి ముసలి పోలీసు మందలింపు.

"ఆయనేం జెయ్యలేద్దొరా. ఇడిచిపెట్టుండ్రి దొరా .. మీకాల్మొక్తదొరా ..." కమలకు దమ్ము ఎగరేసుకొస్తోంది. కంటి రెప్పల్ని సన్నని మంచుతెరకప్పేస్తోంది.

"నీ మొగడు నీకు మంచిగనే కన్పిస్తడే. దొంగెవడో దొరెవడో మాకు తెల్సు.. మా లాఠీకి దెల్సు." జీప్‌లో కుర్రకారు కానిస్టేబుల్ లాఠీ పైకిలేవబోయింది.

"ఆయన దొంగగాద్దొరా ... శాన మంచోడు. ఊరోల్ల నడుగుంద్రయ్యా ..." నాలుక పిడచకట్టుకు బోయింది.

"ఫో ... నీయవ్వ ... జీప్ గూడా ఎడ్లబండి కంటే అన్యాలమైపోయింది. గాపోరి ఉరికొచ్చినంత ఉర్కుతలేదు... " గ్యాసులేని షోడా బుడ్డిలా కస్సుమంది హెడ్డుగొంతు.

అతుకుల బతుకుల్లాంటి గతుకుల రోడ్డుమీద నీటి గుంటలు. పోలీసు జీప్ డ్రైవర్ కోపం నశాళాని కంటింది. ఫలితంగా చక్రాలు గుంతల గొంతులు పిసికేస్తున్నాయి. వర్షంతో నిండిన ఎర్రనీరు చిమ్మి కమల గుడ్డల్ని తడిపేస్తోంది.

ఐనా... కమల పరుగు ఆగలేదు. జీప్‌లున్న తన భర్త తనవైపోసారి చూస్తే బాగుండు... శ్రీనివాసును పలుకరిస్తే బాగుండు.

వారం రోజుల క్రితం ఆదినారాయణ పాలేరుగిరీ మానేస్తానన్నాడు. అగ్గిమీద గుగ్గిలమైపోయాడు పద్మారావు దొర.

"నాదగ్గర దప్ప నువ్వెక్కడా బతుకలేవురా..."

"కూలో నాలో చేస్కుంట బత్కుత దొరా !" దొరముందు మొదటిసారి ఆదినారాయణ గొంతు పెగిలింది. పెంచిన కుక్క పిక్కల మీద కొరికినట్టనిపించింది దొరకు. పళ్ళు పలుగురాళ్ళు నమిలినై. కానీ... వెట్టి నేరమన్న చట్టం గుర్తుకొచ్చి నిప్పులమీద నీరు జల్లింది.

"అదిగాదురా ... నాదగ్గర పంజేస్తుంటే బట్టపాట్టకేమన్నా తక్కువైందా ?

"నా పెండ్లికైన అప్పు అట్లనే ఉంది దొరా !"

"సరే ... ఆ అప్పుల సావుకారికి నేంగడ్తలే !"

"అది కాద్దొరా ..."

"మరింకేందిరా ...?" అరికాలు మంట నెత్తికెక్కింది.

వీడుబోతే మరో జీతగాడు దొరకడు. దొరికినా నెల జీతం కావాలంటాడు. పది గంటలో లేక ఎనిమిది గంటలో డ్యూటీ జేస్తానంటాడు. కార్మిక హక్కులంటాడు... వీడేమో నిద్రలేచిన్నుంచి రాత్రి పద్దాకా రెక్కలొంచి పంజేస్తడు. ఎప్పుడెంతిస్తే గంతే తీస్కుంటడు. ఇదేమని అడగడు...

"ఇంక నీకేం గావాల్నో అడుగరా !"

ఆది నారాయణ గొంతులో పచ్చివెలక్కాయ పడింది నరాల్లోంచి పాకిన ధైర్యం వెలక్కాయను కరిగించింది.

"మా ఇంటిది గూడా పోరుపెడ్తుంది దొరా ! నేనిక్కడ పంజెయ్యనని మూన్నెళ్ళకిందనే మీతోని చెప్పింది గదా ...!"

"చెప్పిందిరా... అది అడి ముం... మరి నీబుద్ధి గిట్లెందుకైందిరా ? అది జెప్తే నేనొప్పుకున్నానా?"

మారు మాట్లాడకుండా ఆదినారాయణ కదిలాడక్కడనుండి... దొరతోని కొట్లాటకు దిగకుమని కమల చెప్పిన సంగతి గుర్తుకొచ్చి వినయంగా వెనుదిరిగాడు.

పంజరం రెక్కలూడదీసి పక్షి బయటపడింది.

బయట కూలీ దొరుకుతోంది. ఏరోజు కూలి ఆరోజు చేతులుంటోంది. అనిర్వచనీయమైన అనుభూతి అలరిస్తుందా జంటను.

కానీ... అది మున్నాళ్ళముచ్చటై పోతుందనుకోలేదు దొర పోలీసులకు పట్టిస్తాడను కోలేదు.

"ఇంగుండూ... ఆ పోరడు నువ్వూ ముక్కు మూడ్చుకుపడ్తరు. జీప్ వెనుక గట్టిగా పట్టుక్కూచున్న ముసలి కానిస్టేబుల్ గుండెలో చెడుగుడు.

"నీ కాల్మొక్త ... ఈ పోరంతోని నేనెట్లా బతకాలె దొరా ? ఆయనిడ్చిపెట్టుంౢడి దొరా ... నీ బాంచేను... కాల్మొక్త ..."

కమల కళ్ళు కాలువలై ఎడమ చెయ్యి శ్రీనివాసు నదిమి పట్టుకుంది. కుడిచెయ్యి పైట సర్దుతుంది. ఎర్రనీటితో తడిచిన గుడ్డల చాటు అందాలనదే పనిగా చూస్తున్న కుర్ర కానిస్టేబుల్.

"అది ఉరికొస్తే నీదేంబోయిందే ... రానీ ..." గుర్రుమన్నాడు.

"అరేయ్ శీనూ జారకురా !" పొదివి పట్టుకుంది.

"అమ్మా... అయ్యతోని నేనూ మోటర్ మీదపోతనే" శ్రీనివాసు ఆరాటం చంకనుండి జారుమంటోంది.

"నీ పెండ్లానికేమన్నా చెప్తావురా ?" యస్పై ఎడమ చెయ్యి ఆది నారాయణ జబ్బమీద పడింది. కుడిచెయ్యి దొరబాపతు ప్రసాదం పదిలం చేసిన ప్యాంటు జేబును తడిమింది. తృప్తి తళుక్కుమంది.

"నేనేం జెప్పాలె దొరా !" ఆది నారాయణ దీనవదనం యస్పై దిక్కు తిరిగింది.

" నేను పాలేరుతనం బందుజేసిన్నని దొర నామీద కేసు బనాయించిండంటే వినకపోతిరి."

"మరి ... పద్మారావు దొర మోటబొక్కెన నీ ఇంటెన్కకెట్లొచ్చిందిరా ? నువ్వు గాకపోతే ఇంకెవడన్నా దెస్త్రా చా ...?"

పద్మారావింటిలో తిన్నకోడి యస్పై కడుపులో కొక్కరకో అంది.

"కావాల్ననే పద్మారావు దొరదాన్ని నా..." ఆదినారాయణ మాట పూర్తి కాకముందే చెంప ఛెళ్ళుమంది. యస్పై చర్యకు ఆవేశం పొంగింది. కానీనిస్సహాయత అణిచేసింది.

జీప్ పక్క ఊరి హోటల్ ముందాగింది. హెడ్డూ యస్పై దిగి హోటల్లో దూరారు.

కమల జీప్‌కు దగ్గరైంది.

"జర... గిటు జూడయ్యా !" శక్తినంతా కూడదీసుకుంది. ఆది నారాయణ చూపులు కమల వైపు మళ్ళాయి. ఆ చూపుల్లో విప్పి చెప్పలేని శతకోటి భావాలున్నై. లోకం పోకడ పట్ల నిరసన దాగుంది.

"నేనేం జెయ్యాలె కమలా ...?"

"మాకు గంజినీళ్ళెట్లా దొరకాలయ్యా?" పొత్తికడుపు లోంచి వచ్చిందా మాట. ఆకుల కొసలనుండి రాల్తున్న నీటి బిందువుల్లా అశ్రు బిందువులు కమల చెంపల్ని తడిపేస్తున్నాయి.

శ్రీనివాసు కళ్ళల్లో మెరుపు...

"అమ్మా నేనుగూడా మోటరెక్కుతనే...!"

రెండు చేతుల్తో తలబాదుకున్నాడు ఆది నారాయణ.

"ఇంగ నువ్వుపో బిడ్డా !" ముసలి కానిస్టేబుల్ గొంతు జీరబోయింది.

"పోయి ఏంజెయ్యాలె దొరా !" కమల గోడు గోడుమంటుంది.

"పద్మారావు దొర నన్నుండనిస్తడా ? నమిలి నీళ్ళుదాగడా ?"

పక్కనే అరటి పళ్ళబండి కనబడింది.

" అమ్మా ... పండే ...! " శ్రీనివాసు కళ్ళు ఆశాదీపాలైనాయి.

"దేనికైనా తెగింపుగావాలె బిడ్డా ! ధైర్యమే లక్ష్మి అన్నరు గదా ! ఎక్కడెవడు దిక్కులేనోనికి దేవుడే దిక్కు..." ముసలి కానిస్టేబుల్ చూపు కమల నుండి ఆదినారాయణ వైపు తిరిగింది.

కమల కళ్ళలోని సత్తువ తిరిగి గుండెలోకి జారుకుంది. శ్రీనివాసును గట్టిగా అదిమి పట్టుకుని మరింత ముందుకొచ్చింది. జీపులో వదిలిపెట్టి పోయిన హెడ్డు తుపాకీ కమల చేతుల్లోకి వచ్చేసింది. ఆదినారాయణ నరాల్లో విద్యుత్తు ప్రవహించింది.

"ఆడదానికే అంత ధైర్యముంటే మరి నాకెందుకుండదూ?" వీపుమీద కొరడా దెబ్బ పడ్డట్టనిపించింది. కన్ను మూసి తెరిచే లోగా కుర్ర కానిస్టేబుల్ తుపాకి ఆదినారాయణ చేతుల్లోకొచ్చేసింది. జీప్‌లోంచి దిగ్గున దూకేశాడు... ఇదంతా ఒక్క నిమిషంలో జరిగిపోయింది.

మరో రెండు నిమిషాల్లో ఆదినారాయణ దంపతులు జీప్‌కు దూరమయ్యారు. కాస్సేపు నోరెల్లబెట్టింతర్వాతగాని కుర్ర కానిస్టేబుల్‌కు గొంతు పెగల్లేదు. మాయలోంచి బయటికొచ్చి "అయ్యో ... అయ్యో... తుపాకులు ... పట్టుకోండ్రి ..." గట్టిగా అరిచాడు.

హెడ్డూ, యస్సై హోటల్లోంచి పరుగెత్తుకొచ్చారు. విషయమర్థమయ్యేందుకు ఐదు నిమిషాలు పట్టింది. యస్సైకి చిర్రెత్తింది.

పోలీసు సిబ్బంది నాల్గు వైపులా పరుగులు దీసి ఆదినారాయణ దంపతుల కోసం గాలించారు... కానీ వారిజాడ కన్పించలేదు.

**అమృత్ కిరణ్ పక్ష పత్రిక తేది: 1-3-1996.**